కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్‌ 45, పచ్చకాకర 40, పందిరి బీర 38, క్యాబేజీ 8, క్యారెట్‌ 21, దొండ 23, గుండుబీన్స్‌ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్‌ 18, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బొల్లారం : ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే ఎన్‌. శ్రీగణేష్‌ పేర్కొన్నారు. బొల్లారంలోని గంగపుత్ర సంఘం, జనహిత సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో, కిమ్స్‌ ఫౌండేషన్‌ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజల కోసం నిర్వహించిన ఈ వైద్య శిబిరం అభినందనీయమన్నారు. కిమ్స్‌ హాస్పిటల్‌ వైద్యులు150 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. బోర్డు మాజీ సభ్యుడు జయప్రకాష్‌, మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ వేణుగోపాల్‌ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా స్వామి వారికి 108 కలశములతో అభిషేకం చేయించారు. అర్చన, హారతి, తీర్థప్రసాద గోష్ఠి పూజలు నిర్వహించారు. సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి, అధికారి ఎస్‌.నరేందర్‌రెడ్డి, చైర్మన్‌, ఫౌండర్‌ ట్రస్టీ బొడ్డు కుమార్‌గౌడ్‌ పాల్గొన్నారు.


నేడు అంబేడ్కర్‌, బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహాల ఆవిష్కరణ



సమావేశంలో బస్తీ నాయకులు

పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ హమాల్‌బస్తీలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌, బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు బస్తీ నాయకులు సుభాష్‌, యాదగిరి తెలిపారు. శనివారం హమాల్‌బస్తీలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రముఖ పారిశ్రామిక వేత్త, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు నాగులూరి సాయిబాబా ఈ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నెల 4 న ఉదయం 11గంటలకు విగ్రహాలను నాలులూరి సాయిబాబా ఆవిష్కరిస్తారని బస్తీ నాయకులు వివరించారు.

తుకారాంగేట్‌ ఎస్‌హెచ్‌ఓగా శ్రీకాంత్‌రెడ్డి



అడ్డగుట్ట: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తుకారాంగేట్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌ రెడ్డి హెచ్చరించారు. తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ నూతన ఎస్‌హెచ్‌ఓగా శ్రీకాంత్‌ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ బదిలీపై చిక్కడపల్లి పోలీస్‌ స్టేషన్‌ డీఐగా వెళ్లగా, బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన శ్రీకాంత్‌రెడ్డి తుకారాంగేట్‌కు వచ్చారు.

గాంధీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌గా బోస్‌ కిరణ్‌



బన్సీలాల్‌పేట్‌: సెంట్రల్‌ జోన్‌ గాంధీనగర్‌ పోలీసు స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్‌. బోస్‌ కిరణ్‌ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పంజాగుట్ట ట్రాఫిక్‌ సీఐగా పనిచేసిన బోస్‌ కిరణ్‌ బదిలీపై గాంధీనగర్‌ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నేరాల అదుపు, శాంతిభద్రతల పరిరక్షణకు నిర్మాణాత్మకమైన కార్యచరణతో ముందుకు సాగనున్నట్లు చెప్పారు. శాంతిభద్రలు, నేరాల విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలించే వ్యక్తులు, శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఏటీఎం వద్ద ఇదో రకం మోసం

- నగదు బయటకు రాకుండా టేప్‌ అతికిస్తున్న దుండగులు
- టెక్నికల్‌ ఫాల్ట్‌ అనుకొని వెళ్లిపోతున్న వినియోగదారులు
- ఆ తరువాత డబ్బు తీసుకుంటున్న నిందితులు



బొల్లారం: తిరుమలగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ కొత్త రకం ఏటీఎం మోసం కేసును పోలీసులు ఛేదించారు. విత్‌డ్రా సమయంలో నగదు రాకుండా టేపును క్యాష్‌ డిస్పెన్సరీ పాయింట్‌వద్ద అతికించి మోసం చేసిన ఇద్దరు ఉత్తరప్రదేశ్‌ యువకులను అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుండి రూ.70,000 నగదు, ఫోన్లు, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

◆ యూపీకి చెందిన అతిక్‌ అహ్మద్‌ (24), మహమ్మద్‌ డానిష్‌ (20) ఓలా డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ముంబయి నుండి హైదరాబాద్‌కు వచ్చిన మోసగాళ్లు తిరుమలగిరి ప్రాంతంలోని ఎస్బీఐ ఏటీఎం వద్ద మోసానికి తెరతీశారు. ఏటీఎం వద్ద వద్ద ఫెవిక్విక్‌ సాయంతో టేపు అతికించి నోట్లు బయటకు రాకుండా చేసి, ఆ ప్రాంతంలో కారులో కూర్చుని ఎదురుచూస్తారు. విత్‌డ్రా చేసిన డబ్బు రాకపోవడంతో వినియోగదారులు సమస్యను టెక్నికల్‌ ఫాల్ట్‌గా భావించి వెళ్లిపోతారు. అనంతరం వీరు వచ్చి టేపును తీసి నగదు తీసుకుంటారు. ఇలా 24 గంటల వ్యవధిలో 12 మందిని మోసం చేసి రూ.90,500 దోచుకున్నట్టు పోలీసులు తెలిపారు. చెన్నై వెళ్లిన తరువాత తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన వీరిని తిరుమలగిరి పోలీసులు వలవేసి పట్టుకున్నారు. ఈ ఘటనపై బ్యాంకు అధికారులు ఆధారాలను తిరుమలగిరి పోలీసులకు అందజేశారు.

ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఏసీపీ గుజ్జా రమేష్‌ పర్యవేక్షణలో నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసును ఛేదించడంలో డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ వేంకట శివారావు, డీఎస్‌ఐ ప్రశాంత్‌, క్రైం సిబ్బంది మహేందర్‌, షైలేష్‌, మంత్రు నాయక్‌, పోలీస్‌ ఇన్స్పెక్టర్‌ నాగరాజు, ఎసిస్టెంట్‌ కమిషనర్‌ గుజ్జా రమేష్‌ కీలకంగా పనిచేశారు.

బీజేపీవి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు

ఎమ్మెల్యే శ్రీగణేష్‌



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌

రసూల్‌పురా: బీజేపీ ప్రజాసామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, స్థానిక సంస్థలను బలహీన పరుస్తోందని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ పేర్కొన్నారు. బీజేపీ రాజ్యంగ ప్రజాసామ్య వ్యతిరేక విధానాలకు నిరసనగా కంటోన్మెంట్‌ రసూల్‌పురాలో కాంగ్రెస్‌ నాయకుల ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్‌, జై సంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా రసూల్‌పురా గాంధీ విగ్రహం నుంచి కంగాల్‌ చౌరస్తా, జగదీష్‌నగర్‌ కాలనీ, నారాయణ జోపిడీ, ఇందిరమ్మనగర్‌, బీరప్ప టెంపుల్‌ అర్జున్‌నగర్‌ మీదుగా అన్నానగర్‌ వరకు శనివారం ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌ బోర్డు ఎన్నికలు ప్రతి ఐదేళ్లకోసారి జరగాల్సి ఉండగా కేంద్రం ఎన్నికలు జరపకుండా నామినేటెడ్‌ మెంబర్స్‌తో అప్రజాస్వామికంగా పాలన కొనసాగిస్తోందని అన్నారు. పదేళ్ళ క్రితం 2015లో చివరిసారిగా కంటోన్మెంట్‌ బోర్డు ఎన్నికలు జరిగాయని 2020లో ఎన్నికలు జరగాల్సి ఉన్నా మరో ఐదేళ్ళు గడచినా ఎన్నికలు జరపలేదని పేర్కొన్నారు. పాదయాత్రల ద్వారా బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శాంసన్‌రాజు, ముప్పిడి గోపాల్‌, ఇటుక గోపి, షేక్‌ నయిం. వినోద్‌, జేపీ. బాబు, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికకు కసరత్తు

- ముమ్మరంగా రాజీవ్‌ యువ వికాసం దరఖాస్తుల స్క్రూటినీ
- వారం రోజుల్లో మొత్తం దరఖాస్తులు పరిశీలిస్తామన్న అధికారులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్‌: రాజీవ్‌ యువ వికాసం పథకం మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఖైరతాబాద్‌, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడబోత కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. షేక్‌పేట, ఖైరతాబాద్‌ మండలాల రెవెన్యూ అధికారులు వారం రోజుల నుంచి దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్నారు. దరఖాస్తులకు జతపరిచిన పత్రాలను పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితా తయారు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను కార్పొరేషన్ల వారీగా విభజించారు. ఆ దరఖాస్తులను తహసీల్దార్ల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేయాల్సిందిగా జిల్లా అధికారులు ఆదేశించారు. షేక్‌పేట మండల తహసీల్దార్‌ అనితారెడ్డి కమిటీ మెంబర్‌ సెక్రటరీగా ఈ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. దరఖాస్తుదారుల్లో గతంలో ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక కొనసాగనుంది. ఆయా మండలాల నుంచి జిల్లా కమిటీకి వడబోత అనంతరం దరఖాస్తులను లబ్ధిదారుల జాబితాతో జిల్లా కమిటీకి పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందజేస్తారు. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఖైరతాబాద్‌, షేక్‌పేట మండలాల పరిధిలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుండగా, కమిటీల పర్యవేక్షణలోనే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

ఖైరతాబాద్‌ నియోజకవర్గంలో 2,458 దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి..

ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో దరఖాస్తుదారులు వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో ఈ పథకం కింద 6,238 మంది ఆన్‌లైన్‌లో మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,458 మంది మాత్రమే ఆన్‌లైన్‌ దరఖాస్తులకు అన్ని ధ్రువపత్రాలు జతచేసి వార్డు కార్యాలయంలో అందజేశారు.

- ఎస్సీ కార్పొరేషన్‌ రుణం కోసం 515 మంది దరఖాస్తులు స్వీకరించగా ఇప్పటి వరకు 335 దరఖాస్తులు స్క్రూటినీ చేశారు. 327 మంది అర్హులుగా గుర్తించారు.
- ఎస్టీ కార్పొరేషన్‌ ద్వారా 171 మంది దరఖాస్తు చేసుకోగా, 78 దరఖాస్తులు మాత్రమే వార్డు కార్యాలయాలకు అందాయి. ఇందులో 76 మందిని అర్హులుగా గుర్తించారు.
- బీసీ కార్పొరేషన్‌ ద్వారా 1,866 మంది దరఖాస్తు చేసుకోగా, 999 దరఖాస్తులు వార్డు కార్యాలయాలకు చేరాయి. 656 మందిని అర్హులుగా తేల్చారు.
- ఈబీసీ కార్పొరేషన్‌ ద్వారా 53 దరఖాస్తులు అందగా, ఇందులో 44 మంది అర్హులుగా గుర్తించారు.
- మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా 787 దరఖాస్తులకుగాను 566 మందిని అర్హులుగా గుర్తించారు.
- క్రిస్టియన్‌ మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా 26 దరఖాస్తులు రాగా ఇందులో 26 మందినీ అర్హులుగా గుర్తించారు.

నేడు ఉచిత ఈఎన్‌టీ, జనరల్‌ వైద్య శిబిరం

సనత్‌నగర్‌: ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) సమస్యలపై జెక్‌కాలనీలోని పార్థివ్‌ లంగ్‌కేర్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయ్‌నగర్‌లోని ఉదయభారతి కల్చరల్‌ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ నాగరాజు, డాక్టర్‌ రాధల ఆధ్వర్యంలో వివిధ రకాల వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలు, బీపీ, షుగర్‌, థైరాయిడ్‌, తరచుగా జ్వరం రావడం, చెవి నొప్పి రావడం, గురక, నిద్రలేమి వంటి ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి వైద్యులు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుందర్‌నగర్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం

సనత్‌నగర్‌: సోమాజీగూడ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సుందర్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌లో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కంజర్ల అమర్‌నాథ్‌ తెలిపారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు హాజరై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు బీపీ, వెయిట్‌, ఎస్‌పీఓ2, పల్స్‌ రేటు, జీఆర్‌బీఎస్‌, ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు జరుపుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఆర్‌నగర్‌ డీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌ డిటెక్టివ్‌ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీకాంత్‌ కనుమర్ల బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన హైదరాబాద్‌ కమీషనరేట్‌ పరిధిలోని లంగర్‌హౌజ్‌,చాదర్‌ఘట్‌ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.ఐటీ సెల్‌లో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను అధికారులు ఎస్‌ఆర్‌ నగర్‌ డీఐగా బదిలీ చేయడంతో శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఓయూ విద్యార్థి నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు సునీల్‌ శెట్టి మాట్లాడుతూ శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. మావోయిస్టుల ఏరివేతకు ఆపరేషన్‌ కగార్‌ పేరుతో ఆదివాసుల జీవించే హక్కులను హరిస్తున్నారని ధ్వజమెత్తారు. వరంగల్‌ సభలో మాజీ సీఎం కేసీఆర్‌ ప్రకటించిన్నట్లు అన్ని రాజకీయ పార్టీలు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్రానికి లేఖ రాయాలని కోరారు.

ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ

సనత్‌నగర్‌: పేదల ఆకలి తీరాలంటే మొదట తినే బియ్యం నాణ్యంగా ఉండాలని, ఆ దిశగా కాంగ్రెస్‌ ప్రభుత్వం దృష్టిసారించి ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా వారికి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. బేగంపేట డివిజన్‌ ప్రకాష్‌నగర్‌లో సన్నబియ్యం పథకం అమలుపై శనివారం ఆయన స్థానిక రేషన్‌ షాపును సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడమే కాకుండా లబ్ధిదారులకు శాలువాలు కప్పి సత్కరించారు. అంతకముందు కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నేత విశాల్‌ సూదం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజలకు మేలు చేసేలా ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు రమేష్‌, నర్సింగ్‌రావు, హోసీటోచర్‌ పాల్గొన్నారు.

పదిలో మెరిసిన సీఎంఆర్‌ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న సీఎంఆర్‌ విద్యాసంస్థల అధిపతి గోపాల్‌ రెడ్డి, డైరెక్టర్‌ ఎస్‌కే రెడ్డి

కంటోన్మెంట్‌: నామమాత్రపు ఫీజులతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్‌ స్థాయి బోధనను అందించడమే తమ లక్ష్యమని సీఎంఆర్‌ విద్యాసంస్థల చైర్మన్‌ చామకూర గోపాల్‌ రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్‌ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 137 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 99 శాతం ఉత్తీర్ణతతో పాటు, 96 శాతం విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఐశ్వర్య 572 , ఆశ్రిత కుమార్‌ 572, పి. చరిత్‌ 571, డి. సాయి అచ్యుత 570, మహమ్మద్‌ ఆరిఫుకుద్దిన్‌ 568, ఏ నాగ సాయి హిమేష్‌ 568, ఆర్‌. ప్రణయ్‌ కుమార్‌ 563, జంపాల దినకరన్‌ 562, సైదా జునేరా ఫాతిమా 561, సుమయ్యా సుల్తానా మార్కులు సాధించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్‌



వార్డు కార్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సామల హేమ

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పోరేటర్‌ సామల హేమ శనివారం పరిశీలించారు. ఇందిరానగర్‌ రోడ్‌ నెంబర్‌ 1లో జరుగుతున్న వరద నీరు, మురుగునీటి కాల్వలలో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడికతీత పనులు సకాలంలో పూర్తిచేసి అకాల వర్షాలు కురిసి సందర్భాల్లోనూ స్థానికులకు ఇబ్బందులు ఎదురవకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం నామాలగుండులో తుదిదశకు చేరిన జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయ భవనం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌,వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు యువకులు చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు శనివారం బీజేపీలో చేరారు. బన్సీలాల్‌పేట్‌ నుంచి ఊరేగింపుగా వెళ్లి బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన యువతకు సముచిత స్థానం కల్పించి గౌరవించుకుంటామన్నారు. సూర్య, శివగుండు, వై. సాయి, ఎస్‌. వివేక్‌, వెంకట్రావు, దేవీ, సాయి, కారుణ్య, అజిత్‌, కార్తికేయ, ఉదయ్‌, దిలీప్‌, మహేష్‌, గణేష్‌ తదితరులు పార్టీలో చేరారు.

దేశ వ్యాప్త కులగణన క్రెడిట్‌ సీఎం రేవంత్‌ రెడ్డిదే

ఉస్మానియా యూనివర్సిటీ: దేశ వ్యాప్త కులగణన క్రెడిట్‌ సీఎం రేవంత్‌ రెడ్డిదే అని ఓయూ జేఏసీ చైర్మన్‌, కాంగ్రెస్‌ నాయకులు ఓరుగంటి కృష్ణ శనివారం పేర్కొన్నారు. కాంగ్రెస్‌ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చూచనల మేరకు తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టిన సీఎం రేవంత్‌ రెడ్డి జాతీయ స్థాయిలో కులగణను మార్గనిర్దేశి ఆయ్యారన్నారు. దేశంలో కులగణన చేపట్టిన మొదటి సీఎంగా రేవంత్‌ రెడ్డి నిలిచారని కొనియాడారు. కులగణనతో పాటు బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–12లోని శ్రీవెంకటేశ్వర హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆనుకుని 22 మంది ప్లాట్‌దారులు తమ ఇళ్ల వెనుక ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ఒక్కో ప్లాట్‌ యజమాని 500 గజాల వరకు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల వెనుక మినీ గార్డెన్‌ను నిర్మించుకున్నారు. కొందరు స్విమ్మింగ్‌ పూల్స్‌ నిర్మించుకున్నారు. మరికొందరు అక్రమ నిర్మాణాలను అద్దెకు ఇవ్వగా మరికొంతమంది శిల్పారామాన్ని తలపించే రీతిలో ఉద్యానవనాలను పెంచుకుంటున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే సర్కార్‌ స్థలాలను ఎమ్మెల్యే కాలనీకి చెందిన కొందరు బడాబాబులు దర్జాగా ఆక్రమించి తమ ప్లాట్లలో కలిపేసుకున్నారు. వీటిని గుర్తించిన రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా, జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన కొంతమంది ప్లాట్‌దారులు అడ్డదారుల్లో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రికార్డులను షేక్‌పేట రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.

అంతరిక్ష సైన్స్‌పై వారం రోజుల క్యాంపు

పంజగుట్ట: అంతరిక్ష సైన్స్‌ అంటే ఏమిటి, అంతరిక్షంలో ఏం జరుగుతుంది తెలుసుకునేందుకు స్కిల్‌ ఈడీయూ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రెసిడెన్షియల్‌ క్యాంప్‌ ఏర్పాటు చేసినట్లు వర్సిటీ వ్యవస్థాపకులు పృథ్వీపతిరావు తెలిపారు. 5వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఈ క్యాంప్‌ ఉంటుందని, హైదరాబాద్‌లోని ఐబీటీలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇస్రో, నాసా, స్కైరూట్‌, ఐబీటీ ప్రొఫెసర్లు, భారతదేశంలోని అంతరిక్ష ప్రముఖ ఫొటోగ్రాఫర్లు ఈ క్యాంపులో పాల్గొని విద్యార్థులకు అబ్జర్వేషన్‌ అడ్వాన్స్‌ టెలిస్కోప్‌ ద్వారా లైవ్‌లో చూపిస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు ఫోన్‌: 97000 63637 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘డైనోసార్ల’కు మరమ్మతులు చేపట్టండి



డైనోసార్‌ పార్కును పరిశీలిస్తున్న ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–92లోని జీహెచ్‌ఎంసీ డైనోసార్‌ పార్కును ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి శనివారం సంబంధిత యూబీడీ అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.కోట్లు వెచ్చించి ఇక్కడ ఏర్పాటు చేసిన డైనోసార్ల శిల్పాలు చాలావరకు దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అలాగే పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు డిజైన్లు రూపొందించి అంచనాలు తయారు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల సివిల్‌ వర్క్స్‌ పెండింగ్‌లో ఉన్నాయని, టైల్స్‌ వేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం ప్రశాసన్‌నగర్‌ పార్కును కూడా ఆయన పరిశీలించారు. పార్కులో మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్‌ డీసీ సమ్మయ్య, ఈఈ విజయ్‌కుమార్‌, పార్కుల విభాగం అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడ్డ చెట్ల కొమ్మలు

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

లాలాపేట: నగరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. తార్నాక, లాలాపేట, శాంతినగర్‌ ప్రాంతాల్లో దాదాపు గంట పాటు వర్షం కురిసింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు తడిసి ముద్దయ్యారు. రోడ్లపై ట్రాఫిక్‌ జాం అయింది. తార్నాక డివిజన్‌ లాలాపేట, శాంతినగర్‌ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. తక్షశిలా స్కూల్‌ ఏరియాలో విద్యుత్‌ వైర్లపై చెట్ల కొమ్మలు పడటంతో లాలాపేట శ్రీపురి కాలనీ, శాంతినగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్‌ ఎమర్జెన్సీ టీం విద్యుత్‌ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు, సిబ్బందితో కలిసి సహాయక కార్యక్రమాల్లో సోషల్‌ వర్కర్‌ నేతికార్‌ మహేశ్‌ పాల్గొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్‌.. అయినా పట్టదా..?



బంజారాహిల్స్‌: పంజగుట్ట చౌరస్తాలోని మెరిడియన్‌ హోటల్‌ వద్ద అక్రమ పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అక్రమ పార్కింగ్‌ తొలగించాలంటూ స్థానికులు, వాహనదారులు ఎన్నిసార్లు కోరుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ హోటల్‌ ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను సదరు హోటల్‌ యాజమాన్యం పూర్తిగా కబ్జా చేసింది. పార్కింగ్‌తో రోడ్డంతా ఇరుగ్గా మారిపోవడంతో పాటు ఫ్రీ లెఫ్ట్‌ వెళ్లాల్సిన వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అమీర్‌పేట వైపు నుంచి పంజగుట్ట చౌరస్తాకు వచ్చే ఈ రోడ్డులో పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఆ ప్రాంతంలో రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్‌ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.